ప్రజాశక్తి

ఆదివారం 8 జనవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

9 నెలలు.. రూ.190 కోట్లు ఆదాయం

ఊపందుకోని రిజిస్ట్రేషన్లు - వెనుకబడ్డ యలమంచిలి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంటుందన్న రియల్టర్ల అంచనాలు తలకిందులవుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం ఆశించిన స్థాయిలో పరుగులు తీయడంలేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల కొనుగోలుపై ఆసక్తి కనబర్చకపోవడంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్ల ఆదాయంపై పడింది. భూముల వ్యవహారాల్లో లిటిగేషన్లు పెరగడంతో కొనుగోలుకు ముందుకురాని పరిస్థితి నెలకొంది. యలమంచిలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని ప్రాంతాల్లో ప్రధాన రహదారులకు ఆనుకొనివున్న గ్రామాలు, అచ్యుతాపురం, రాంబిల్లి సెజ్ సమీపంలో పెరిగిన భూముల విలువతోపాటు వివాదాలు ఎక్కువ వుతున్నాయి. ఈ కారణంగా జిల్లాలోని పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఎక్కువ ఆదాయం సమకూరాల్సిన యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అతి తక్కువ రిజిస్ట్రేషన్లు జరిగాయి. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం (2022-23)లోని మూడు త్రైమాసికాల (డిసెంబరు) వరకు వ్యవసాయ, వ్యవసాయేతర రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.190.23 కోట్ల ఆదాయం లభించింది. డిసెంబరు వరకు రూ.266.86 కోట్లు రిజిస్ట్రేషన్ల ద్వారా మిగతా 2లో..



అనకాపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సబ్ రిజిస్ట్రార్ల వారీగా ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు లక్ష్యం, ఆదాయం (రూ.కోట్లలో)

సబ్ రిజిస్ట్రార్	లక్ష్యం	ఆదాయం	శాతం
1.అనకాపల్లి	55.96	46.40	82.92
2.చోడవరం	16.42	11.04	67.26
3.కె.కోటపాడు	5.24	4.10	78.16
4.కోటవురట్ల	9.48	6.88	72.58
5.లంకెలపాలెం	49.13	33.57	68.33
6.మాడుగుల	6.16	4.45	72.21
7.నక్కపల్లి	23.92	18.31	76.53
8.నర్సీపట్నం	18.04	13.00	72.06
9.సబ్బవరం	26.12	19.44	74.42
10.యలమంచిలి	56.34	33.00	58.58

6 గంటల్లో..

భారీ దొంగతనం కేసు ఛేదన

నలుగురు నిందితులు అరెస్టు
రూ.15 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును ప్రదర్శిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన భారీ దొంగతనం కేసులో నలుగురు నింది తులను కేవలం ఆరు గంటల్లోనే పట్టు కున్నట్టు నగర పోలీస్ కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం తన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘటన వివరాలు తెలిపారు. శుక్రవారం రాత్రి ఎంవిపి కాలనీ సెక్టార్ -1లో నివాసం ఉంటున్న 72 సంవత్సరాల అశోక్ కుమార్ ఇంట్లోకి నలుగురు చొరబడి ఇంట్లో ఉన్న వారిని కత్తులు, కత్తెరలతో బెదిరించారన్నారు. రూ.15 లక్షల విలువయిన 30 తులాల బంగారం, డైమండ్, వెండి ఆభరణాలను, 3 వాచీలు, 2 ఫోన్లను, రూ.7 వేలు నగదును అపహరించి పరారయ్యారని తెలిపారు. వెంటనే బాధితుని కుమారుడు చంచల్ గుప్తా అప్రమత్తమై 112 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నైట్ పెట్రోల్, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి శనివారం తెల్లవారుజాము 4:30 గంటలకు నిందితులను పట్టుకున్నారన్నారు. నిందితుల్లో బీహార్‌కు చెందిన మిథలేష్ కుమార్ యాదవ్, ముకేశ్ కుమార్, ప్రదీప్ యాదవ్, జార్ఖండ్‌కు చెందిన చందన కుమార్ ఉన్నారన్నారు. రైలు కోసం ఎదురు చూస్తుండగా వీరిని స్టేషన్‌లో అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు.

9న మున్సిపల్ వర్కర్ల టోకెన్ సమ్మె

వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

వార్త 2లో..

మోడరన్ ఫిష్ మార్కెట్ ప్రారంభం

వార్త 2లో..



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వేదికపై అయ్యన్న, రామకృష్ణ తదితరులు

ఉత్తరాంధ్రకు ప్రభుత్వాల వెన్నుపోటు

- సుజల స్రవంతి, బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ, గిరిజన వర్సిటీపై ప్రజా ఉద్యమం
- 'ఉత్తరాంధ్ర చర్చా వేదిక' సదస్సులో వక్తలు
- జెపికి 'ఉక్కు' నిరసన సెగ

వార్త మెయిన్‌లో...

జి-20 సదస్సు నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మార్చి 28, 29 తేదీల్లో జరగబోయే జి -20 సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు జరుగుతున్నాయని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి అన్నారు. శనివారం మధ్యాహ్నం విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించామన్నారు. ఈ సదస్సుకు సుమారు 45 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సుమారు 200 మంది ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులను ఆకట్టుకునేలా విశాఖ నగరాన్ని సుందరీకరణ చేస్తున్నామన్నారు. వివిధ టూరిస్ట్ ప్రదేశాలతో పాటు ప్రాచీన ప్రాచుర్యం కలిగిన ప్రదేశాలను సుందరీకరిస్తున్నామన్నారు. వారికి అర్థమయ్యే భాషలో తెలిపేందుకు ట్రాన్స్‌లేటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జి - 20 సదస్సు నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా 8 జిల్లా కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలు స్టేట్ లెవెల్ కమిటీలతో అనుబంధంగా పని చేస్తాయన్నారు. జిల్లాలో ప్రముఖంగా 10 టూరిస్ట్ ప్రాంతాలను గుర్తించామన్నారు. పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు రెండు రోజుల పాటు వారు సంచరించే ప్రాంతాలలో ఎటువంటి సమస్యలూ ఉత్పన్నం కాకుండా పటిష్టమైన భద్రత కల్పిస్తామన్నారు. ఎఎస్ఆర్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అరకు, బొర్రాలను టూరిస్ట్ ప్రాంతాలుగా సుందరీకరణ చేస్తున్నామన్నారు. వీటి మిగతా 2లో..



మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

మొదటి పేజీ తరువాయి..

9 నెలలు.. రూ.190 కోట్లు ఆదాయం

ఆదాయం సమకూరుతుందని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖాధికారులు అంచనా వేశారు. కానీ డిసెంబరు నాటికి రూ.190.23 కోట్ల (71.28 శాతం) ఆదాయం వచ్చింది.

జిల్లాలోని రెండు త్రైమాసకాల (సెప్టెంబరు)కు రూ.180.36 కోట్ల ఆదాయం వస్తుందని అంచనావేయగా, రూ.132.90 కోట్లు (73.69 శాతం) సమకూరింది. గడచిన మూడు నెలల్లో రిజిస్ట్రేషన్లు 2.41 శాతం తగ్గుముఖం పట్టాయి. అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సెప్టెంబరు వరకు లక్ష్యంలో 96.44 శాతం రిజిస్ట్రేషన్లు జరగ్గా, డిసెంబరు నాటికి ఆ శాతం 82.92 శాతానికి పడిపోయింది. అయినా పదింటిలో అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రిజిస్ట్రేషన్లలో మొదట స్థానంలో నిలిచింది. యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల శాతం సెప్టెంబరు నుంచి డిసెంబరుకు 54.19 నుంచి 58.58 శాతానికి కాస్త పెరిగింది. అయితే మిగిలిన తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి సమకూరిన ఆదాయం కంటే యలమంచిలి వెనుకబడివుంది. జాతీయ రహదారికి సమీపంలో లేని కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు జరగడంతో ఆ మేరకు రిజిస్ట్రేషన్లు పెరిగాయి.

జి-20 సదస్సు నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

సందర్శనకు వచ్చే వివిధ దేశాల ప్రతినిధులకు ట్రైబల్ కల్చర్, కళలను తెలియజేస్తామన్నారు. అతిథులకు ఇది ఒక తీపి గుర్తుగా ఉండేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రవాసాంధ్ర గాయని మణిశాస్త్రి, ప్రముఖ సీనియర్ గాయనీ గాయకులు చంద్రతేజ, వినోద్ బాబు, శేషుకుమారి అరుదైన కలయికలో విశాఖ నగరాన ప్రత్యేక సినీ సంగీత కార్యక్రమం జరుగనుంది. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికపై ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ సంగీత కార్యక్రమం ప్రారంభమవుతుందని రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ, గంగాధర్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ వేమలి త్రినాధరావు, అంజుశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో సినీ సంగీత రంగంలో పాడుతా తీయగా, స్వరాభిషేకం వంటి స్టేజ్, టీవి రియాల్టీ షోల ద్వారా ప్రాచుర్యం పొందిన సీనియర్ గాయకులు చంద్రతేజ, వినోద్ బాబు ద్వయం తొలిసారిగా విశాఖ వేదికపై పూర్తిస్థాయి కచేరీలో పాల్గొంటారని తెలిపారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఇన్‌కం ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జి.కృష్ణారావు, స్టార్‌మేకర్ సత్యానంద్, లీడర్ పత్రిక సంపాదకులు వివి.రమణమూర్తి అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో మౌలిక వసతుల కల్పనే ప్రథమ కర్తవ్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె నాలుగో జోన్ పరిధి 28వ వార్డు నెహ్రూ నగర్, గవర్నర్ బంగ్లా ప్రాంతాలలో సుమారు రూ. 23.40 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండలతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌ఛార్జి పల్లా దుర్గారావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మాస్టర్ అథ్లెటిక్స్

ప్రజాశక్తి-గుంటూరు : మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాస్టర్ అథ్లెట్లకు గుంటూరు ఎన్‌టిఆర్ స్టేడియంలో శనివారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విశాఖపట్నం వారు సాధించారు. మెన్స్ ఛాంపియన్‌షిప్ గుంటూరు వారు, మహిళా ఛాంపియన్‌షిప్ నెల్లూరు వారు సాధించారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో కోవెల మూడి నాని పాల్గొని పతకాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద వయస్సు కలిగిన క్రీడాకారులు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు లాల్‌వజీర్, రవి, కాలేషావలి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు తలపెట్టిన నిరాహార దీక్షలు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ శీతల్ మదన్, రాష్ట్ర మాజీ కన్వీనర్ పోతిన వెంకట రామారావు మాట్లాడారు.

మోడరన్ ఫిష్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్‌లో రూ.2.75 కోట్లతో నిర్మించిన మోడరన్ ఫిష్ మార్కెట్‌ను రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదరి అప్పలరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో మత్స్యకారులకు అన్ని విధాలా మేలు జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొంత చర్చ.. ఇంకొంత రచ్చ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోనే ఇటీవల కాలంగా 'హాట్ టాపిక్' ఏదైనా ఉందంటే ఉత్తరాంధ్ర ప్రాంతం - మూడు రాజధానులు - వైజాగ్ స్టీల్‌ప్లాంట్. ఇవన్నీ చర్చకైనా.. రచ్చకైనా దారితీసే అజెండాలే. ఒక్కో అంశంపై ఒక్కో రాజకీయ పార్టీకి ఒక్కో అభిప్రాయం ఉండడం సహజం. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకూడదన్న దాంట్లో బిజెపి మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ తరతమ తేడాలతో ఏకాభిప్రాయాన్నే వ్యక్తం చేస్తున్నాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధి - రాజధాని అంశాలు సరేసరి.. ఒక్కో పార్టీకి ఒక్కో అభిప్రాయం, విభేదాలు. తాజాగా శనివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన ఉత్తరాంధ్ర చర్చా వేదిక సదస్సులో లోక్‌సత్తా పార్టీ విధానం ఏమిటో స్పష్టంగా వెల్లడైంది. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను కించపరుస్తూ.. రెండేళ్లుగా కార్మికులు చేపడుతోన్న స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని దెబ్బతీసేలాగ ఆ పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ తీరు వ్యక్తమైంది. అయితే ఆయనకు ఆయనగా స్టీల్‌ప్లాంట్‌పై చర్చ చేయకపోయినా ప్రభుత్వ రంగ సంస్థల కంటే ప్రైవేట్ కంపెనీలే సేవల్లో నాణ్యతను ఇస్తాయన్న అభిప్రాయాన్ని సభా వేదిక నుంచి రుద్దాలని చూశారు. దీన్ని పలువురు అక్కడే వ్యతిరేకించడం విశేషం.

ముఖ్య అతిథే దారితప్పితే ఎలా ?

'ఉత్తరాంధ్ర చర్చా వేదిక సదస్సు'లో ముఖ్య అతిథిగా ప్రసంగించడానికి శనివారం విచ్చేసిన జెపి 'అసలు ఉత్తరాంధ్ర ప్రగతికి జీవనాడి' విశాఖ స్టీల్‌ప్లాంట్ అన్న విషయం గమనంలో లేకుండా వ్యవహరించడం పలువురిని విస్మయానికి గురిచేసింది. దీంతో సహజంగానే విశాఖ ఉక్కు కార్మికుల నిరసన సెగ ఆయనకు తగిలింది. ఆయన ఉద్యోగ కాలంలో జరిగిన సన్నివేశాలు, అందులో ఆయన నిజాయితీ పనులను ఉటంకిస్తూ చేసిన ప్రసంగాన్ని సభికులంతా శ్రద్ధగానే ఆలకించారు. అప్పటికే మధ్యాహ్నం 2 గంటలు కావస్తుండడంతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతున్న ప్రస్తుత తరుణంలో స్టీల్‌ప్లాంట్‌పై అభిప్రాయం చెప్పాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులైన జె.అయోధ్యరాం, ఆదినారాయణ ఇంకొంతమంది కార్మికులు డిమాండ్ చేశారు. 'విశాఖ



ఉక్కు-ఆంధ్రుల హక్కు' అంటూ నినాదాలు చేయగా జెపి వారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'ఏయ్...ఓయ్... కూర్చో' అంటూనే 'మీరు కేకలేస్తే నా అభిప్రాయం మార్చుకోను, మీరు ఉద్యోగాలు చేసిందానికంటే ముందే నేను ఈ ఏరియాలో అధికారిగా పనిచేశాను' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్‌పై కావాలంటే మరో వేదికపై చర్చిస్తానంటూ తీవ్ర ఆవేశంతో వెల్లడించే సరికి స్టీల్‌ప్లాంట్‌కు చెందిన నాయకులు, కార్మికులు ఇంకా పెద్ద పెట్టున ప్రైవేటీకరణ వ్యతిరేక నినాదాలు చేస్తూ పైకి రండి మాట్లాడుదాం అంటూ కార్మిక నేతలు సవాల్ విసిరారు. దీంతో సభలో చాలా సేపు గలాటా సాగింది. దీనికి ముందు బిఎస్ఎన్ఎల్‌ను విమర్శచేస్తూ... తన సెల్ ఫోన్ తీసి స్టేజీపై నుంచి సభికులకు చూపిస్తూ 'సేవలన్నవి ముఖ్యం.. అది ప్రభుత్వ రంగం అయితే ఏమిటి? ప్రైవేట్ అయితే ఏమిటి? బిఎస్ఎన్ఎల్‌లోకి ప్రైవేట్ రంగం రాబట్టే కదా నాణ్యమైన సేవలు విస్తరించాయి..' అని జెపి అనడంతో కార్మికులు విశాఖ ఉక్కు నినాదాలను గట్టిగా అందుకున్నారు. వేదికపైగల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కూడా ప్రభుత్వ రంగ మౌలిక వసతుల ఆధారంతోనే ప్రైవేట్ కంపెనీల సేవలుంటాయి తప్ప సొంతంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్‌కి ఎక్కడున్నాయి ? అంటూ ప్రశ్నించారు. ఇదే ఉత్తరాంధ్ర చర్చా వేదిక సదస్సులో తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కూడా తన రాజకీయ అభిప్రాయాల చుట్టూ వేదికను మలచుకునే ప్రయత్నం చేస్తూ అధికార వైసిపిపై విమర్శనాస్త్రాలు ఏకపక్షంగా ఎక్కుపెట్టడం కనిపించింది. అయితే ఇది తనదైన శైలిలో వ్యంగంగ్యానూ, హాస్యచతురతతో కూడినదై ఉండడంతో ఎవ్వరికీ పెద్ద ఇబ్బంది రాలేదనే చెప్పొచ్చు.

కానీ.. రాష్ట్రంలో ఒక ఉన్నతాధికారిగా పనిచేసి, రాజకీయ పార్టీని కూడా ఏర్పాటు చేసి, మేధావి అనిపించుకున్న జయప్రకాష్ నారాయణ ప్రైవేట్ రంగాన్ని నెత్తికెత్తుకుంటూ ప్రభుత్వ రంగాన్ని, కార్మికోద్యమాన్ని తూలనాడడంపై కార్మికులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా సంపదను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని బిజెపి పూర్తిగా పనిచేస్తుంటే జెపి సమర్థించడం ఎంతవరకు సరైందంటూ పలువురు కార్మికులు, సదస్సుకు హాజరైన జనం చర్చించుకోవడం కనిపించింది.

9న మున్సిపల్ వర్కర్ల టోకెన్ సమ్మె

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి అధికారులు, రాష్ట్ర అధికారులు తమ యూనియన్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తున్నారని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి అన్నారు. అంగీకరించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మినిట్స్‌లో అంగీకరించిన అంశాలను అమలు చేయడానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. మరణించిన, అనారోగ్యంతో సెలవుల్లో ఉన్న, 60 ఏళ్లు నిండిన వారి వారసులకు 482 కొత్త పోస్టుల్లో నియమించాలని డిమాండ్ చేశారు. వీరిని కాకుండా ఇతరులను నియమిస్తే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఆప్కాస్‌లో చేర్చని వారిని చేర్చి, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు జీవో 7 ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలన్నారు. నీటి సరఫరా, విద్యుత్, యుజిడి కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని వరుస రెండు రోజులు నిరసన కార్యక్రమాలు చేపట్టామని, 9న టోకెన్ సమ్మె ఉంటుందని అన్నారు. అప్పటికీ అధికారులు దిగి రాకపోతే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరికూటి రాజు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు గొలగాని అప్పారావు, సహాయ కార్యదర్శి ఎస్.రమణ, నాయుడు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైఎస్ఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్ రెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారానికి 646వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకూడదని రాష్ట్రంలోని బిజెపి మినహా అన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు వై.మస్తానప్ప, వైసిపి కార్పొరేటర్ పివి.సురేష్ పాల్గొన్నారు.

జాన్‌కు నాలుగో తరగతి ఉద్యోగుల నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలోని సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో చైన్‌మెన్‌గా పనిచేసి అకస్మికంగా మరణించిన కూడా జాన్ (25)కు కలెక్టరేట్, ఇతర జిల్లా కార్యాలయాల నాలుగో తరగతి సిబ్బంది శనివారం కలెక్టరేట్‌లో సంతాపం తెలిపారు. అంకితభావంతో విధులు నిర్వహించిన జాన్ ప్లేట్‌లెట్స్ సమస్యతో చిన్న వయసులో చనిపోవడం బాధాకరమని వివిధ శాఖల నాలుగో తరగతి ఉద్యోగులు టి.వెంకటరమణ, బి.సాయి, ఆర్.సూర్యనారాయణ, బిసి రమేష్, సతీష్, ప్రసాద్, రమణమ్మ, వరలక్ష్మి, ఎస్.శ్రీనివాసరావు, ఎల్లాజీ, శర్మ అన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు భువనేశ్వరి



ప్రజాశక్తి- తగరపువలస : అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 9 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో బిడిఎస్ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థిని ఎల్‌టి భువనేశ్వరి ఎంపికయ్యారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం తరపున ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్ వంశీకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, యాజమాన్యం అభినందించింది

రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన యువకుడు జగన్ ప్రమాదానికి గురై ఆరేళ్ళుగా ఇంటికే పరిమితమయ్యాడు. గణేష్ దసరా సేవా సంఘం ఆధ్వర్యాన శనివారం అతని ఇంటికి వెళ్ళి నిత్యావసర సరుకులతో పాటు రూ.8 వేలు ఆర్థిక సహాయాన్ని వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, సత్తి మందారెడ్డి, సంతోష్, మోహన్, శ్రీను, అర్జున్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-సింహాచలం: జివిఎంసి 98వ వార్డు పరిధిలో కొత్త లబ్ధిదారులు పెన్షన్లను కన్వీనర్లు లంక సత్తిబాబు, భోగి సమాజం సాడి మధు ద్వారా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పార్టీలు, మతాలు, కులాలకతీతంగా అర్హులైన అందరికీ పెన్షన్లు పంపిణీ చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామరాజు, సిరిపురం కృష్ణ, రాము, బోర కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నో బ్యాగ్ డే

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే నో బ్యాగ్ డే నిర్వహించారు. తంతి తపాలా పెట్టె, పక్షి గూళ్ళు, వివిధ జంతువుల బొమ్మలు అట్ట ముక్కలు, చిత్తు కాగితాలతో తయారుచేశారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు నో బ్యాగ్ డే దోహద పడుతుందని హెచ్ఎం అప్పలరాజు తెలిపారు. ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, నాగమణి, ఎస్ఎంసి చైర్ పర్సన్ మానసాదేవి తదితరులు పాల్గొన్నారు

టిడిపి విజయం తథ్యం : కోరాడ

ప్రజాశక్తి -తగరపువలస : 2024 ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమని పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ధీమా వ్యక్తంచేశారు. జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలసలో శనివారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకు పోయిందని విమర్శించారు. వివిధ తరగతుల ప్రజలు నష్ట పోతున్నారని ఆరోపించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు పిట్టా సురేష్, వానపల్లి సత్య, నారాయణరావు, గిడుతూరి శ్రీనివాసరావు, ఎంవి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంచ గ్రామాల భూ సమస్యపై ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కృష్ణంరాజు

ప్రజాశక్తి-సింహాచలం: పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సింహాచలంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు టివి.కృష్ణంరాజు బి రమణి మాట్లాడుతూ, పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి నేటికీ పరిష్కరించలేదన్నారు. పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కమిటీ వేసి మూడున్నరేళ్లు గడిచినా అతీగతీ లేదన్నారు. సింహాద్రి దేవస్థానం వద్ద 1996లో గత ప్రభుత్వం ఇచ్చిన పట్టా తప్ప ఎటువంటి ఆధారాలూ లేవన్నారు. 1903లో జరిగిన గిల్మన్ సర్వే తర్వాత ఎటువంటి సమగ్ర అధికారిక సర్వే జరగలేదని తెలిపారు. 1903లో జరిగిన సర్వే సెటిల్‌మెంట్ రికార్డుల ప్రకారం 1785 ఎకరాలు జిరాయితీ భూములుగా అనేక మంది రైతులు పేర్లు ఉన్నాయని చెప్పారు. దేవస్థానానికి కేవలం 39.5 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు రికార్డుల ద్వారార స్పష్టమవుతోందని తెలిపారు. ప్రస్తుతం ఎవరి ఆధ్వర్యంలో ఉన్న ఇల్లు స్థలాల్లో వారు మరమ్మతులు సహా నిర్మాణాలను అనుమతించాలని, సింహాచల దేవస్థానానికి 1996- 97 లలో ఇచ్చిన అక్రమ పట్టాల రద్దుచేయాలని, దేవస్థానం దాడులను అరికట్టాలని. 1903 సర్వే సెంటిమెంట్ గిల్మన్ రికార్డు ఆధారంగా భూ హక్కు జారీని గుర్తించాలని నినదించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ ఈ ధర్నాకు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం సభ్యులు సూర్యారావు, బి.అరుణ్‌కుమార్, ఎం.రాంభద్రరావు, ప్రసాద్, సత్యనారాయణ, తెలుగు యువత అధికార ప్రతినిధి సత్తివాడ శంకరరావు పాల్గొన్నారు.

ఘనంగా విజ్ఞాన్ విహార్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార్ ఆవాస్ విద్యాలయంలో కళా వైజ్ఞానిక ప్రదర్శనలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించు ప్రదర్శనలు భారతదేశ మొదటి మహిళ సైకియాట్రిస్ట్ హరిచంద్ర తీరిటికల్ ఫిజిక్స్ శత జయంతి సంవత్సరం సందర్భంగా అంకితమిచ్చినట్లు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైంటిస్ట్-ఎఫ్ వైవిఎస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చదువు, వృత్తితో పాటు దేశ సేవ యొక్క ఆవశ్యకతను వివరించారు. విద్యార్థి చదువుతోపాటు మంచి నడవడికను కలిగి ఉండాలన్నారు. దేశ ప్రయోజనాల కోసం ఉపయోగపడే పరికరాలపై పరిశోధనలు చేస్తే పురోగతి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దూసు రామకృష్ణారావు, పేరు రామకృష్ణమూర్తి, పివి.నారాయణరావు, జి.సుబ్రమణ్యేశ్వరరావు, కెఎస్ఎస్ రాజేశ్వరరావు, పి.నాగలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమాటోగ్రఫీ మంత్రిని కలిసిన దాడి



మంత్రి వేణుగోపాల కృష్ణను కలిసిన దాడి సత్యనారాయణ

ప్రజాశక్తి -ములగాడ : సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రామచంద్రపురంలోని అతని నివాసములో మాజీ డిప్యూటీ మేయర్, ఏపీ మా గౌరవాధ్యక్షులు దాడి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సినీ కళాకారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వేణుగోపాలకృష్ణ సానుకూలంగా స్పందించి కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారని సత్యనారాయణ తెలిపారు.

అంగన్‌వాడీ, సామాజిక భవనాల ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు పరిధి అక్కయ్యపాలెం, ముస్లిం తాటిచెట్లపాలెంలో రూ.45.85 లక్షలలో నిర్మించిన అంగనవాడీ కేంద్రం, సామాజిక భవనాలను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, ప్రజలకు సంక్షేమ ఫలాలతో పాటు మౌలిక వసతులను కల్పిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మెరుగుపరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, హబీబ్, హీర, షోఫియ, శ్యామలదేవి, సీతారాం, ఎం.గోపి, పి.గోపి, సుధాకర్‌రెడ్డి, ఆదినారాయణ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, శివాజీ నగర్-1 లో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతసత్యనారాయణ ఆధ్వర్యాన గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కరమాని విజయనిర్మల గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి రూ.10 వేలు

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 53వ వార్డు పరిధి మర్రిపాలెం ప్రాంతం లక్ష్మీనగర్‌కు చెందిన కిడ్నీ పేషెంట్ కె.మోహన్‌రావుకు సికెడియు పెన్షన్ రూ.10 వేలును కార్పొరేటర్ బర్కత్ అలీ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలీ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభరుత్వం పెన్షన్లు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబ్జి, రఘూన్సీ, చాందిని తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 53వ వార్డు పరిధి పార్వతీనగర్‌లో ఉన్న అన్వూర్ ప్లే స్కూల్లో శనివారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. బాలలు హరిదాస్ వేషధారణలో వచ్చి అలరించారు. నిర్వాహకులు చిన్నారులచే ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఫరీద్ మాట్లాడుతూ, సంక్రాంతి అత్యంత ప్రాముఖ్యమైందన్నారు.

నేరాలు ఘోరాలు

దుకాణంలో చోరీ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని రాజాంలో జెర్రిపోతుల తాతరాజు అనే వికలాంగుడికి చెందిన కిల్లీ దుకాణంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. తాళాలు పగలగొట్టి, దుకాణం లోపలికి ప్రవేశించి, రూ.7వేలు నగదు, ఖరీదైన సిగరెట్లు అపహరించుకుపోయారు. శనివారం ఉదయం దుకాణం తెరిచేసరికి సామాన్లన్నీ చెల్లాచెదురుగా పడి ఉండంతో చోరీ జరిగినట్లు గుర్తించి బాధితుడు లబోదిబోమంటున్నారు.

బాధితునికి ఆర్థికసాయం

కిల్లీ బడ్డీయే ఆధారంగా జీవనంసాగిస్తున్న తాతరాజుకు బుచ్చియ్యపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మరిసా నాని పరామర్శించారు. బాధితుడికి రూ.2వేలు ఆర్థిక సాయం అందించారు.

రోడ్డు ప్రమాదంలో విఆర్‌ఒకు గాయాలు

ప్రజాశక్తి - వడ్డాది : బిఎన్ రోడ్డులో వడ్డాది వెంకటేశ్వరస్వామి ఆర్చ్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రావికమతం మండలం చినపాచిల విఆర్ఒ బూరపు సత్తిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. చోడవరం నుంచి వస్తున్న సత్తిబాబు, ఆర్చ్ వద్ద బైకు ఆపి ఫోను మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తిబాబు తల, చేయి, కాలుకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి, అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎటువంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

పాఠశాలల్లో రమాప్రభ పర్యటన

ప్రజాశక్తి-సింహాచలం: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ శనివారం పలు పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.

ఎపిఎంటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపిఎంటిఎఫ్ పట్టణ నూతన కార్యవర్గాన్ని శనివారం భీమిలిలో ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు పివి.చంద్రరావు ఆధ్వర్యాన జరిగిన ఎన్నికల్లో యూనియన్ పట్టణ అధ్యక్షునిగా జి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.అమర్‌నాథ్, కోశాధికారిగా కె.లీలామణి, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా వై.ప్రతాప్‌సింగ్, ఎ.నైముద్దీన్, ఉపాధ్యక్షులుగా వైవి.రవికుమార్, ఎస్.జగదీష్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.మురళీకృష్ణ, పి.కిరణ్‌కుమార్, కె.ఇందిర ఎన్నికయ్యారు. మహిళా కార్యవర్గాన్ని కూడా ఎన్నికున్నారు.

'యువశక్తి'కి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-మధురవాడ : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఈ నెల 12వ తేదీన శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో చేపట్టనున్న యువశక్తి కార్యక్రమం నిర్వహణ కోసం భీమిలి నియోజకవర్గం 8వ వార్డు జనసేన నాయకులు, మహిళలు, కార్యకర్తల తరుపున రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు పార్టీ భీమిలి నియోజకవర్గ నాయకులు శాఖరి శ్రీనివాస్ అందజేశారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మణిరామ్ తదితరులు

ప్రజానాట్యమండలి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: ప్రజానాట్యమండలి రాష్ట్ర కేంద్రం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను విశాఖపట్నం జిల్లా డిపిఆర్ఒ డీడీ మణిరామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిరామ్ మాట్లాడుతూ, ప్రజానాట్యమండలి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, జిల్లా అధ్యక్షులు జి.రమణ, జిల్లా గౌరవాధ్యక్షులు దండు నాగేశ్వరరావు, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు అరుణ్‌జి, పోర్టు విశ్రాంత ఉద్యోగి, సీనియర్ దర్శకులు బొట్ట వేణుగోపాలరావు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

సిఐ లూథర్‌బాబు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సిఐ లూథర్‌బాబు

ప్రజాశక్తి -ములగాడ : యువత సన్మార్గంలో నడవాలని మల్కాపురం సిఐ లూథర్‌బాబు కోరారు. జివిఎంసి 63వ వార్డు పరిధి క్రాంతినగర్ డివైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యాన యర్నాగుల రామారావు, ఎస్‌కె.అస్లాం 15వ వర్ధంతి సభను శుక్రవారం రాత్రి నిర్వహించారు. వీరి వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన ఆటల పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. డివైఎఫ్ఐ క్రాంతినగర్ ఏరియా అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభకు సిఐ లూథర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆటల పోటీలు నిర్వహించిన డివైఎఫ్ఐ కమిటీని అభినందించారు. డివైఎఫ్ఐ గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరిస్తామని చెప్పారు. డివైఎఫ్ఐ విశాఖ జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసగించాయని విమర్శించారు. మోడీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలని చెప్పారని, జాబ్ కేలండర్ పేరుతో జగన్మోహన్‌రెడ్డి మోసాం చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పేరుతో త్రివిధ దళాల ఉద్యోగాలను కాంట్రాక్టు వర్కర్లు మాదిరిగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ మాట్లాడుతూ యువత చెడుమార్గాలకు పోకుండా మంచి మార్గంలో నడిపించేలా కృషిచేస్తున్న డివైఎఫ్ఐ కమిటీని అభినందించారు. నిరుద్యోగ యువకులంతా ఉపాధి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖ రోటరీ క్లబ్ కార్యదర్శి మోదంబికా దేవి, క్రాంతినగర్ డివైఎఫ్ఐ వ్యవస్థాపకులు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, నేటి ప్రభుత్వ విధానాల వల్ల నిరుద్యోగం పెరిగిందన్నారు. యువతకు ఉపాధి లేక చెడు వ్యసనాలకు గురవుతున్నారన్నారు. మరో వైపు ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రయివేటీకరణకు పూనుకుంటున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్ముతామని చెప్పడం దుర్మార్గమన్నారు. ఈ విధానాలను ప్రభుత్వాలు విడనాడాలని కోరారు. క్రాంతినగర్ గ్రామ ప్రెసిడెంట్ కె.పరదేశినాయుడు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు వై.కల్యాణి, గ్రామపెద్దలు భాస్కరరావు, పి.సురేష్, గోపాల్, సిఐటియు నాయకులు లక్ష్మణమూర్తి, పైడిరాజు, డివైఎఫ్ఐ మల్కాపురం జోన్ కార్యదర్శి ఎస్.వాసు, నాయకులు, కె.నగేష్, ఎం.విష్ణు, డి.ప్రేమ్, ఎస్.నవీన్, జి.నరేష్, లక్ష్మణ్, డి.కిషోర్, ఎస్.నాగేంద్ర, ఎస్.గణేష్, ఎం.కిరణ్, జి.దాసు, కె.శ్రీను, ఎమ్‌డి.బషీర్, సిహెచ్.సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందించిన జోషఫ్ కుటుంబ సభ్యులకు, వేదిక సప్లై సామానులకు ధనసహాయం చేసిన కొసిరెడ్డి దండయ్య కుమారులు వెంకటరమణ, అప్పారావుకు డివైఎఫ్ఐ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

శంకుస్థాపనల రగడ

ఒకే పనికి కార్పొరేటర్, తర్వాత ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధిలో శంకుస్థాపనల రగడ చోటుచేసుకుంది. జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీ, ఎకలవ్య కాలనీలో శంకుస్థాపన కార్యక్రమాలను అధికారులు చేపట్టారు. వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వకుండా ఈ కార్యక్రమాన్ని పెట్టారని ఎమ్మెల్యే రావడానికి అరగంట ముందే పీలా శ్రీనివాసరావు శంకుస్థాపనలు చేశారు. తరువాత ఎమ్మెల్యే కూడా వచ్చి శంకుస్థాపన చేశారు. దీన్ని చూసి ప్రజలు ముక్కుల వేలేసుకుంటున్నారు. గతంలో కూడా వివాదాల మధ్యనే శంకుస్థాపనలు జరిగాయి. కార్పొరేటర్ వచ్చి శంకుస్థాపన చేసిన తర్వాత ఎమ్మెల్యే చేయడం అవమానమేనని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రతిసారీ ఇలా వివాదాలు జరిగితే పార్టీ బలహీనపడుతుందని వైసిపి నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం

పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అదిప్‌రాజ్ తెలిపారు. 96వ వార్డు పరిధిలో పలు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి నాయకులు, ప్రజలు సలహా మేరకు రోడ్లు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాడి ఉమామహేశ్వరరావు ఎల్‌బి.నాయుడు, గొర్లి రామనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిధులు కావు : పీలా

96వ వార్డు పరిధిలో పనులకు జివిఎంసి నుంచి తాను మంజూరు నిధులు మంజూరు చేయించానని, ఇవి ఎమ్మెల్యే నిధులు కావని కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాభిప్రాయం మేరకు రోడ్లు వేస్తున్నామని చెప్పారు. వాటికి ఎమ్మెల్యే వచ్చి తనకు తెలియకుండా శంకుస్థాపన చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించకుండా శంకుస్థాపన చేస్తారా అని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

మురళీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 49వ వార్డు పరిధి మురళీనగర్ -5, పట్టాభిరెడ్డితోట ప్రాంతాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, కార్పొరేటర్ అల్లు శంకరరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజలు తెలిపిన సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో విశాఖ నగరం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.రవికుమార్, నూకరాజు, 49వ వార్డు నాయకులు ఆదిరెడ్డి శ్రీను, ఢిల్లీరావు, కమలాకుమారి, స్వరస్వతి, మెర్సీ, చంద్రశేఖర్, నాగరాజు, చైతన్యహరి, బి.శంకర్, నాయకులు కర్రి రామారెడ్డి, హరిపట్నాయక్, షేఖ్ బాబ్జి, కె చిన్న, నేపాల్ శ్రీను, సమ్మెట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ సిఎమ్‌డితో ఐఎస్‌టిడి సభ్యుల భేటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ సిఎండి, ఐఎస్‌టిడి అడ్వయిజరీ కమిటీ చైర్మన్ అతుల్‌భట్‌తో విశాఖపట్నం చాప్టర్ మేనేజింగ్ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. హెచ్‌ఆర్ నిపుణుల ప్రయోజనం కోసం ఆర్‌ఐఎన్‌ఎల్‌తో కలిసి నిర్వహించగల కార్యక్రమాలపై చర్చించారు. త్రైమాసిక మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, ఇతర హెచ్‌ఆర్ సంబంధిత కార్యకలాపాలను నిర్వహించాలని చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఒఆర్‌ఎం రావు ప్రతిపాదించారు. ఎండిపిలకు సంబంధించిన అంశాలు, కార్యకలాపాలపై చర్చించారు. తదుపరి కార్యాచరణ ప్రణాళిక గురించి సలహా ఇచ్చేందుకు ఆర్‌ఐఎన్‌ఎల్‌లో ఎంసి సభ్యుల కోసం సమావేశానికి అధ్యక్షత వహించాల్సిందిగా సిఎమ్‌డిని అభ్యర్థించారు. ఐఎస్‌టిడి గౌరవ కార్యదర్శి డాక్టర్ హేమ యడవల్లి విశాఖపట్నం చాప్టర్ ద్వారా ఈ-జర్నల్‌ను ప్రారంభించడం గురించి ప్రస్తావించారు. జర్నల్ మొదటి సంచికకు సందేశం ఇవ్వాలని ఆమె అభ్యర్థించారు. అందుకు సిఎమ్‌డి సమ్మతించారు.

ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ బైలా ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 93వ వార్డు పరిధి కృష్ణనగర్‌లోని ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ ప్రధాన కార్యాలయంలో సంస్థ నియమ నిబంధనావళి పుస్తకం, అప్లికేషన్‌ను నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్ డోల శంకరరావు ఆధ్వర్యాన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ సంస్థ ద్వారా మానవ హక్కులపై నిరంతరం పోరాడతామని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనుకునే వారు, మానవ హక్కులు, సమస్యలు పోరాడే వారికి సంస్థ సాదర స్వాగతం పలుకుతుందన్నారు. హక్కుల కార్యకర్తలకు రూ.పది లక్షల చొప్పున జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ జనరల్ సెక్రెటరీ హ్యాపీ జయకుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఐఎస్ రాజు, కోశాధికారి ఆర్.విజయ, సభ్యులు కెవి.రమణమూర్తి, పి.కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశీలు అక్రమ వసూళ్లు నిలిపేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి- గాజువాక : లారీల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న ఆశీలను నిలిపివేయాలని ది ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఎగ్జామ్స్ పార్కులో శనివారం విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లారీల లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో కళాశీలకు చార్జీలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లారీ యజమాని గుమస్తా రుసుముతో పేరుతో డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కేవలం రవాణా తాలూకా బిల్లు మాత్రమే యజమానికి ఇవ్వాలి తప్ప, గతంలో మాదిరిగా గుమస్తా డబ్బులు కూడా జోడించి బిల్లు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల లారీ ఆపరేటర్లు, యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిఎస్‌టి, ఓవర్‌లోడ్ పేరుతో ప్రభుత్వాలు కూడా వసూలు వసూలు చేసి ఇబ్బందిపెడుతున్నాయని వివరించారు. జనవరి 15 నుంచి అన్ని అసోసియేషన్లు ఒకే తాటిపైకి వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఎం.బాపరాజు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం జిల్లాల లారీ యజమానులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : గుంటూరు జిల్లా ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న 40వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో ఉక్కు కార్మికులు సత్తాచాటారు. అగనంపూడి పరిధి దిబ్బపాలెంనకు చెందిన చట్టి నర్సింగరావు వివిధ విభాగాల్లో పలు పతకాలు సాధించారు. ముప్పై ఏళ్లు పైబడిన క్రీడాకారులకు జరుగుతున్న ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగుపందెంలో, 5 కిలోమీటర్ల నడకలో వెండి పతకాలు, 400 మీటర్ల పరుగులో బంగారు పతకం సాధించారు. చట్టి నర్సింగరావు ఎస్‌బిఎం విభాగంలో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్నారు. వచ్చే నెల 16, 17, 18 తేదీల్లో జాతీయ స్థాయిలో చండీఘడ్ జరిగే పోటీలకు ఎంపికయ్యారు. గతంలో జిల్లాలో జరిగిన పోటీలలో 1500 మీటర్ల పరుగు పందెంలో రెండో బహుమతి, 5000మీటర్ల పరుగుపందెంలో మొదటి బహుమతి సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలలోనూ విజయం సాధించారు. బిఎఫ్ ఆపరేషన్స్ విభాగంలో జరరల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న సూర్య నారాయణ 5 కిలోమీటర్ల నడక విభాగంలో బంగారం, 800 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకాలను సాధించారు. ఈ పోటీల్లో 10 జిల్లాల నుంచి 690 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ సిఎస్‌పి-3 విభాగంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సిరపనశెట్టి మోహన్ 200 మీటర్ల పరుగులో బంగారం, 800 మీటర్ల పరుగులో సిల్వర్ పతకాలు సాధించారు. గతంలో జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో కూడా మోహన్ అద్భుత ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించారు. ఫిబ్రవరి 10, 11, 12 తేదీల్లో కలకత్తాలో జరిగే నేషనల్ అథ్లెటిక్ పోటీలకు మోహన్ ఎంపికయ్యాడు.



చట్టి నర్సింగరావు

అక్రమ నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డులో నరవ కాంప్లెక్స్ ఎదురుగా అనధికారికంగా నిర్మిస్తున్న అంతస్తుకు సంబంధించి డెకింగ్‌ను జివిఎంసి అధికారులు తొలగించారు. గతంలో మూడుసార్లు తొలగించినా భవన యజమానులు మళ్లీ నిర్మాణ పనులు చేపట్టడంతో వచ్చిన ఫిర్యాదుల మేరకు తొలగించినట్లు టిపిఎస్ తేజ తెలిపారు. జివిఎంసి సిబ్బంది తూతూ మంత్రంగా తొలగింపులు చేస్తుండటంతో యజమానులు మళ్లీ నిర్మాణ పనులు సాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

వైశాఖిలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-మాధవధార : సంక్రాంతిని పురస్కరించుకొని శ్రీఉత్సవ్ ఈవెంట్, వనితా వాకర్స్ క్లబ్ సంయుక్తంగా మురళీనగర్‌లోని వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనూహ్యమైన స్పందన లభించింది. సంక్రాంతి పండగను కళ్ళకు కట్టినట్టు రంగవల్లులు వేసిన వారిని క్లబ్బు సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయంతోపాటు పాల్గొన్న వారందరికీ బహుమతులు బహుమతులను శ్రీ ఉత్సవ్ ఈవెంట్స్ ప్రతినిధులు అందజేశారు. ముగ్గుల పోటీకి న్యాయ నిర్ణేతలుగా వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, సుజాత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రభాశర్మ, కె.వినీల, రోజా రాణి, షీల తదితరులు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి -కంచరపాలెం : ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 47వ వార్డు బాపూజీనగర్‌లో దిశ చట్టంపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ దివ్యభారతి మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పిల్లలు చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి మహిళా దిశ యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏ సమస్య వచ్చినా పోలీసులను సంప్రదిస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐ సతీష్, కానిస్టేబుల్ చంద్రరావు, మహిళలు పాల్గొన్నారు.

'ఫార్మా'లో భద్రతా వైఫల్యంపై సమగ్ర విచారణ

ప్రజాశక్తి - పరవాడ: పరవాడ ఫార్మాసిటీ స్మైలెక్స్ పరిశ్రమలో ఈనెల 5న భద్రతా వైఫల్యం వల్ల జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఫార్మాసిటీలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 5న జరిగిన ప్రమాదంలో పెయింటింగ్ పనులు చేస్తున్న ఒక కార్మికుడు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలైన విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ, కార్మికుల శ్రమతోలాభార్జనే తప్ప, కంపెనీలో వారికి కనీస సౌకర్యాలు, భద్రతాచర్యలు చేపట్టాలన్న ఆలోచనను ఫార్మాసిటీలోకి కంపెనీలు

సిఐటియు డిమాండ్



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న కార్మికులు

గాలికొదిలేశాయన్నారు. ఇటీవల చోటుచేసుకున్న వరుస ప్రమాదాలే ఇందుకు నిదర్శనమన్నారు.కార్మికచట్టాలను యాజమాన్యాలు ఉల్లంఘించడం, సంబంధిత అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడాన్ని సిఐటియు తరపున ఖండిస్తున్నామన్నారు. 2019లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా ఒకరు గాయపడ్డారని, ఇపుడు పైడిరాజు అనే కార్మికుడు మృతి చెందగా, అప్పారావు అనే కార్మికునికి గాయాలయ్యాయన్నారు. 2018లో కార్మికుల జీతాల నుంచి కట్ చేసిన ఇపిఎఫ్ డబ్బులు రూ.54 లక్షలు ఆయా శాఖలకు జమ చేయకుండా యాజమాన్యం అడ్డదారిన దిగమింగేసిందన్నారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యవైఖరి వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో సిఐటియు నేతలు జి సింహాచలం, ఆర్ ప్రసాద్, బి లోవరాజు పాల్గొన్నారు.

నేడు 'బ్రాండిక్స్' ఉచిత నేత్ర వైద్యశిబిరం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా 98వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ ఇండియా అపెరల్ పార్క్ దరి బ్రాండిక్స్ సిఎస్ఆర్ క్యాంప్ వద్ద నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు సమీప ప్రాంతాల ప్రజల సంక్షేమం, వారి ఆరోగ్యసంరక్షణలో భాగంగా బ్రాండిక్స్ ఆధ్వర్యాన ఈ వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

సుగర్స్ పురోభివృద్ధికి కృషి



చెరకు కాటాను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి-దేవరాపల్లి :గోవాడ సుగర్ ఫ్యాక్టరీని లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేయాలని ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడుకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సూచించారు. శనివారం మండలంలోని తెనుగుపూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెరకు కాటాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెనుగుపూడిలో చెరకు కాటా ఏర్పాటు కోసం ఎన్నాళ్ళ నుంచో రైతులు ఎదురుచేస్తున్నారని, వారి కాంక్షను సాకారం చేస్తూ కాటాను ఏర్పాటు చేశామన్నారు. దాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యత్వంఉన్న రైతులతోపాటు సభ్యత్వం లేని రైతులకు కూడా ఫ్యాక్టరీ నిర్ణయించిన ధర అందిస్తామన్నారు. కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ ఎండి సిడిఓ రామం, మధుసూదనరావు, నాగేశ్వరరావు, కష్టమనాయుడు, వైస్ ఎంపిపి చింత బుల్లిలక్ష్మి, జెడ్పిటిసి కర్రి సత్యం, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, కాటిపాము పెదనాయుడు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసిలో ప్రాంతీయ స్థాయి పోటీలు

ప్రజాశక్తి - పరవాడ : ఎన్‌టిపిసిలో ప్రాంతీయ స్థాయి మేధా ప్రతియోగిత పోటీలను సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా శనివారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలో పాల్గొన్న వారందరినీ ప్రాజెక్ట్ హెడ్ అభినందించారు.ఎన్‌టిపిసి కుటుంబాలతోపాటు పోటీల్లో పాల్గొనే వారికి సందర్శకులకు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమ నిర్వాహకులు హెచ్ఆర్ రుమా డి శర్మ ప్రశంసించారు. నాలుగు కేటగిరీల్లో నిర్వహించిన ప్రాంతీయ స్థాయి మేధాప్రతియోగిత పోటీల్లో దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయంతో సహా వివిధ ప్రాజెక్టులకు చెందిన మొత్తం 21 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో



జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభిస్తున్న సంజయ్‌కుమార్

విజేతలు జాతీయ స్థాయి మెరిట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా బహుమతులు అందజేశారు. చీఫ్ జనరల్ మేనేజర్ బి రామారావు, జనరల్ మేనేజర్ డిపి పాత్ర , రష్మీ రంజన్ పాల్గొన్నారు.

'సుగర్స్' పరిరక్షణకు రైతు సంఘాల సన్నద్ధత



మాట్లాడుతున్న చెరుకు రైతు సంఘం నేత అప్పారావు

ప్రజాశక్తి-.అనకాపల్లి : జిల్లాలోనిసహకార చక్కెర కర్మాగారాల పరిరక్షణకు రైతు సంఘాలు సిద్ధం కావాలని ఏపీ చెరుకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు అధ్యక్షతన ఏపి రైతు సంఘం, ఏపి చెరుకు రైతు సంఘం, ఏపి కౌలు రైతు సంఘం, సహకార రైతు సంఘాల ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నాలుగు సహకార చక్కెర కర్మాగారాలను కాపాడుకోవాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కర్రి అప్పారావు, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మేక సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, వై ఎన్ భద్రం, కాంగ్రెసుల రాము మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఏటికొప్పాక, తాండవ, తుమ్మపాల సహకార చక్కెర కర్మాగారాల మూతకు కారణం ముఖ్యమంత్రి నుంచి ఆర్థికపరమైన హామీ లేకపోవడమేనన్నారు. కొద్దిపాటి మరమ్మత్తులతో ఈ మూడు ఫ్యాక్టరీల క్రషింగ్ సాధ్యం అన్నారు. చక్కెర కర్మాగారాలే అతిపెద్ద ప్రాసెసింగ్ యూనిట్లు అన్నారు. ప్రభుత్వం చెరుకు రైతుకు మద్దతు ధర చెల్లిస్తే రైతుకు నష్టం వాటిల్లదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫ్యాక్టరీల క్రషింగ్ చర్యలు చేపట్టాలని, లేకుంటే రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం



కశింకోటలో రచ్చబండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా

గడపగడపలో టిడిపి నేతలు

ప్రజాశక్తి -కశింకోట : రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న వైసిపి నిరంకుశ పాలనలోరాష్ట్రంలో అభివృద్ధి శూన్యమనిమాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. శనివారం కశింకోటలో నాలుగు రోజు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాట్లాడుతూ, మంత్రిగా గుడివాడ అమర్నాథ్ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే విస్సన్నపేట భూములపై విచారణ జరగడం లేదన్నారు. కార్యక్రమంలో నేతలు కాయల మురళి, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపీకృష్ణ, ప్రధానకార్యదర్శి పెంటకోట రాము, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు నైనంశెట్టి రమణారావు, కాండ్రేగుల సతీష్, కందల జగన్నాథం, ఆడారి నరసింగరావు, వేగి వెంకటరావు, సిద్దిరెడ్డి సూర్య నారాయణ, కొంతం ఈశ్వరమ్మ, కలగా సోమేశ్వరరావు , కలగా చిన్నా, కలగా శివానంద, శంకర్, రమణ, విజ్జు దేవేంద్ర పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

దేవరాపల్లి: అధికార అహంకారంతో ముఖ్యమంత్రి జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మాడుగుల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, సీనియర్ నేత పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికిలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతూ, జగన్ దుర్మార్గపు పాలనపై ప్రశ్నించే గొంతులను దుర్మార్గపు చీకటి జిఒలను జారీ చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో పోతల పాత్రునాయుడు, గొర్లెపోటు నరసింహమూర్తి, కర్రి సింహాద్రి నాయుడు, లెక్కల సత్యనారాయణ, పోతల రాజనాయుడు, తమడాన ప్రసాద్, గుల్లిపల్లి అర్జునరావు, కడియం నాగేశ్వరరావు, రాయిపురెడ్డి ఈశ్వరరావు, చింత సాంబమూర్తి, పైలా నాయుడు, చల్లా నానాజీ కొమర బాబూరావు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో పెచ్చరిల్లుతోన్న అరాచకం

అచ్యుతాపురం : వైసిపి పాలనలో రాష్ట్రంలో అరాచకం పెరిగిపోయిందని తెలుగుదేశం పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. చీమలపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికిలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి అరాచకపాలనపై వివరించారు. జగన్‌రెడ్డి పాలనలో అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్‌కు టిడిపిని గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. దేశం పార్టీ మండల అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు ,గ్రామ మాజీ సర్పంచ్ మామిడి శివ అప్పారావు పాల్గొన్నారు.

కార్పొరేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నీలిమ భాస్కర్

ప్రజాశక్తి - అనకాపల్లి : కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు అన్నారు. జివిఎంసి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో గవరపాలెం సంతబయలు ప్రాథమిక పాఠశాలలో రూ.78 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పాఠశాల అదనపు గదుల నిర్మాణం, మరమ్మతులు, సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దుతోందన్నారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి శివ నారాయణ, కర్రి అప్పాజీ, చిన్న, నారాయణ, సతీష్, హెచ్‌ఎం లలిత, స్మార్ట్ సిటీ ప్రాజెక్టు సిబ్బంది, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలి



బాస్కెట్‌బాల్ ఎంపికల్లో పాల్గొన్న జెసి కల్పనాకుమారి

ప్రజాశక్తి- అనకాపల్లి : బాస్కెట్‌బాల్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అన్నారు. శనివారం ఎఎంఎఎల్ కళాశాలలో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 ఏపి అంతర్ జిల్లాల బాలురు, బాలికల క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు చక్కని ఆట తీరు ప్రదర్శించి విజయాలను అందుకోవాలని సూచించారు. రాష్ట్రజట్టుకు ఎంపికైనా, కాకపోయినా క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. ముందుగా కళాశాల ఎన్‌సిసి ఆర్మీ, నేవీ విభాగాల గౌరవ వందనం స్వీకరించారు. బాస్కెట్‌బాల్ రాష్ట్ర పరిశీలకులు ఎంఎం శ్రీనివాసరావు, ఆర్‌ఐపి మురళీధర్, ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, అనకాపల్లి వర్తక సంఘం గౌరవ కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణరావు(పెదబాబు), కళాశాల అధ్యక్ష కార్యదర్శులు మంగరాజు, దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జి జయబాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధి జరగాలి

ప్రజాశక్తి - కశింకోట : వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధి జరగాలని అనకాపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పరుచూరి భాస్కరరావు అన్నారు. ఈనెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో నిర్వహించనున్న యువశక్తి సమావేశంపై మండలంలో తాళ్ళపాలెం రామాలయం వద్ద సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఇన్‌ఛార్జి చింతా రాజేష్, కశింకోట మండల నేతలు పావాడ కామరాజు, కర్రి లోవరాజు, కర్రి గోవింద పాల్గొన్నారు.

జెడ్‌సి వెంకటరమణకు అభినందన

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా వెంకటరమణ శనివారం బాధ్యతలు చేపట్టారు. భీమునిపట్నం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఆయన అనకాపల్లి బదిలీపై వచ్చిన సంగతి తెలిసిందే. జెడ్‌సి వెంకటరమణను శనివారం ఆర్యవైశ్య సంఘం అనకాపల్లి శాఖ అధ్యక్షులు కరిమిశెట్టి సతీష్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



జెడ్‌సిని అభినందిస్తున్న సతీష్

69వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

ప్రజాశక్తి - రాంబిల్లి : ఎనిమిది గ్రామాలకు చెందిన నేవీ నిర్వాసితులు వాడనర్సాపురం ఎన్ఎఒబి గేటు వద్ద చేస్తున్న ఆందోళన శుక్రవారం 69వ రోజుకు చేరుకుంది. గతంలో అధికారులు ఇచ్చిన హామీలను, తమతో చేసుకున్న ఒప్పందాలను అమలుచేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. తమకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, జెఎసి నేతలు పాల్గొన్నారు

వైసిపి కేలండర్ ఆవిష్కరణ


వైసిపి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గ వైసిపి కేలండర్‌ను స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇరువాడ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి కనకరాజు సౌజన్యంతో కేలండర్ ఆవిష్కరించడం ఆనందదాయకమన్నారు. ఈసందర్భంగా వైసిపి ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కోటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, గొర్లి ఉమామహేశ్వరరావు, బండారు శ్రీను, దాసరిఈశ్వరరావు, సబ్బవరపు నాగభూషణం, సబ్బవరపు బుజ్జి, ఐడి బాబు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంపై అవగాహనకు మండలంలోని మొగలిపురంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర భూసర్వేతో రైతులకు తమ భూములపై శాశ్వత భూహక్కు పత్రాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. తహసీల్దార్ బి. సత్యనారాయణ మాట్లాడుతూ భూసర్వేలో గ్రామ రైతులు పాల్గొని తమ భూముల్లో ఏమైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. వినతులను స్వీకరించారు. జెడ్‌పి వైస్‌చైర్మన్ తుంపాల అప్పారావు, సబ్బవరపు నారాయణమూర్తి, యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ ఐ డి బాబు, విఆర్‌ఒ జ్యోతి, సర్వేయర్ గండి ముత్యాలనాయుడు, బోను నాయుడు, బండారు శ్రీను, రైతులు పాల్గొన్నారు .

బిషప్‌లు ఉపాధ్యాయుల వలే పనిచేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : బిషప్‌లు ఉపాధ్యాయుల వలె పనిచేయాలని బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ అన్నారు. శనివారం స్థానిక కల్వరి అపోస్టలిక్ చర్చిలో ఉత్తరాంధ్ర బిషప్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, బిషప్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బాలరాజు, విక్టర్ పాల్, నవీన్ మోజెస్, వి. సుదర్శనరావు, పిడిపాల్, సాల్మన్‌రాజ్, మోహన్ కుమార్, దేవప్రసాద్, వరప్రసాద్, మధు మనోహర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిషప్ ప్రవీణ్

స్వచ్ఛ విద్యాలయ అవార్డులకు 403 పాఠశాలలు

ఎపి ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవేందర్ రెడ్డి


మాట్లాడుతున్న దేవేందర్ రెడ్డి

ప్రజాశక్తి -అనకాపల్లి : యుడైస్ డేటా ఆధారంగా స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు అనకాపల్లి జిల్లాలో 561 పాఠశాలలను గుర్తించగా, వాటిలో 403 పాఠశాలలు అర్హత పొందినట్టు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక జివిఎంసి బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా డిఇఒ లింగేశ్వరరెడ్డి, అనకాపల్లి డిప్యూటీ డిఇఒ ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్స్, సమగ్ర సెక్టోరల్ అధికారులు, ఎంఇఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, హాజరు, ఉపాధ్యాయుల పనితనం, పిల్లల అభ్యాసన సామర్థ్యాల ఆధారంగా ప్రతి మండలం నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఒకటి, అలాగే హైస్కూలు, హైస్కూల్ ప్లస్ పాఠశాలల నుంచి ఒకటి,అలాగే మున్సిపాలిటీ నుంచి మండల స్థాయిలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష జరిపి తీర్మానం చేసి సదరు జాబితాను జనవరి 13లోగా రాష్ట్ర కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిస్టెంట్ డైరెక్టర్లు రవిబాబు, డిఇఒ కార్యాలయ ఎపిఒ, ఎన్ఒ, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దేవానంద స్వామి ఆరాధనోత్సవం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో సద్గురు దేవానంద సరస్వతీ మహరాజ్ 23వ ఆరాధనోత్సవాలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ రొంగలి వెంకటరావు (నీలిమ) దేవానంద స్వామి ఆధ్యాత్మిక జీవన సంఘం (ఆశ్రమం) ఆధ్వర్యంలో జరిగినఉత్సవాలకు దేశ విదేశాలతో పాటు, తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

స్వామి విష్ణుదేవానంద సరస్వతి సభా అధ్యక్షతన పీఠాధిపతులు రామకృష్ణానంద, శ్రీను సిద్ధాంతి, స్వామి యోగానంద భారతి, ప్రజ్ఞానంద సరస్వతి, మహేంద్ర పట్నాయక్ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు భారీ అన్న సమారాధన నిర్వహించారు. జెడ్‌పిటిసి కర్రి సత్యం, ఆధ్యాత్మిక జీవన సంఘం అధ్యక్షులు కర్రి దేముడు, కార్యదర్శి నర్సింగరావు, సిరికి నాగభూషణం, మాజీ సర్పంచ్ శంకరరావు పాల్గొన్నారు.

పోలీస్ సర్కిల్ కార్యాలయానికి సొంత భవనం

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఇన్నాళ్లు అద్దె భవనంలో అవస్థలు పడుతూ కాలం వెల్లదీసిన పోలీస్ సర్కిల్ కార్యాలయానికి ఎట్టకేలకు సొంత భవనం చేకూరింది. మండల కేంద్రంలో మరిడిమాంబ ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన సర్కిల్ కార్యాలయాన్ని శనివారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, అనకాపల్లిఎంపి భీశెట్టి వెంకట సత్యవతి, డిఐజి ఎస్.హరికృష్ణ ప్రారంభించారు. దీంతో పోలీస్ సిబ్బందితోపాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్‌పి గౌతమ్ సాలి, డిఎస్‌పి సునీల్, సిఐ తాతారావు, ఎస్ఐలు ధనుంజయ, రామకృష్ణ, ఎంపిపి రెడ్డి జగన్మోహన్, జెడ్‌పిటిసి ఈర్లె అనురాధ, లంకవానిపాలెం సర్పంచ్ దొరబాబు పాల్గొన్నారు.


నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బూడి, ఎంపీ సత్యవతి, డిఐజి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పండగ పూట పస్తులు తప్పవా...

ప్రజాశక్తి - అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రభుత్వ పాలనలో ఉద్యోగస్తులకు పండగ పూట పస్తులు తప్పేట్టులేదని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఎద్దేవా చేశారు.. శనివారం రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు వేతనం చెల్లింపు ఆశలు నానాటికీ మృగ్యమౌతున్నాయన్నారు. ప్రతినెలా20వ తేదీ తర్వాతే జీతాలు జచ్చే పరిస్థితి ఉందన్నారు. క్రిస్మస్, కొత్తసంవత్సరం గడచిపోయినా ముందున్న పెద్దపండుగ సంక్రాతి సమీపిస్తున్నప్పటికీ, నేటికీ జీతుల అందని పరిస్థితుల్లో కొత్తబట్టల కొనుగోలు, సొంతూళ్లకు పయనం వంటివి ఎలాగని ఉద్యోగులు తలలు పట్టుకునే పరిస్థితి ఉండడం శోచనీయమన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగస్తులకు మాయమాటలు, బూటకపు హామీలతో ఓట్లు దండుకుని, ఇపుడు వాటన్నింటినీ అటకెక్కించేయడంతోపాటు, అప్పులు పుడితేగానీ జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొనడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోందన్నారు సమావేశంలో పార్టీ నాయకులు కుప్పిలి జగన్మోహన్ పాల్గొన్నారు.

వచ్చే నెల 20కి ఇ-క్రాప్ నమోదు పూర్తి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఫిబ్రవరి 20వ తేదీ నాటికి ఈ పంట నమోదు పూర్తి కావాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు కోరారు. శనివారం. గవరపాలెం రైతు భరోసా కేంద్రంలో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో మండలాల వారీగా రబీ సాగు విస్తీర్ణం, రబీ ఈక్రాప్ పంట నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఫిబ్రవరి 20నాటి ఇక్రాప్ నమోదు పూర్తిచేస్తే, 21 నుంచి 28 వరకు సామాజిక తనిఖీలకు ఆస్కారముంటుందని, వాటిపై అభ్యంతరాలను మార్చి ఒకటి నుంచి ఐదు వరకు స్వీకరించి ఏడవ తేదిన తుది జాబితావెల్లడిస్తారన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమాన్ నిధి సాయనికి ఇకైవైసికి నమోదు గడువును ఈనెల 15 వరకు పెంచారన్నారు.కార్యక్రమంలో ఎడిఎ కె రామారావు,ఎఒలు రంగాచారి, జోత్స్న, స్వప్న, హెచ్ఒ ధనలక్ష్మి పాల్గొన్నారు.

గడపగడపకూ మంత్రులు, ఎమ్మెల్యేలు

సంక్షేమ పథకాల అమలుపై ఆరా - సమస్యల సమీకరణ


స్త్రీనిధి చెక్కును అందజేస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని జమాదులపాలెంలో రాష్ట్రమంత్రి గుడివాడ అమర్నాథ్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వద్దులతో ముచ్చటించి, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అర్హులై ఉండి సాంకేతిక, ఇతరత్రా సమస్యలతో పథకాలు వర్తించకుంటే వెంటనే సచివాలయాన్ని సంప్రదించాలని సూచించారు. జమాదులపాలెంలో జగనన్న ఇళ్ల కాలనీకి శంకుస్థాపన చేశారు. 134 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు చామలవాకలో రూ.20 లక్షలతో సిసి రోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు రంగుబోలుగెడ్డ రిజర్వాయర్ ను మంత్రి సందర్శించారు.750 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్న రిజర్వాయర్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు.. స్త్రీ నిధి రుణం కింద రూ.3.62కోట్ల చెక్కను అందజేశారు.కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, వైస్ ఎంపిపి నమ్మి మీనా,జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు, మలసాల కిషోర్, అనకాపల్లి ఎంపిపి గొర్లి సూరిబాబు,గ్రామ సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కరక సోమినాయుడు, ఉప సర్పంచ్ గూడుపు అప్పలనాయుడు, ఎంపిటిసి గూడుపు లక్ష్మీ రాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఒమ్మి గంగినాయుడు, బొట్ట రాజారావు పాల్గొన్నారు

కె.కోటపాడు : చౌడువాడ శివారు మల్లంపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. నాడు నేడు నిధులతో మండల పరిషత్ పాఠశాల నూతన భవనానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ, సిసి రోడ్లకు నిధులు మంజూరు చేశారు. రూ.23 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా 167 ఇళ్లకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపిరెడ్డి జగన్మోహన్, జెడ్‌పిటిసి ఈర్లె అనురాధ, ఎంపిడిఒ కె శచిదేవి పాల్గొన్నారు.


సొంత నిధులను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం : మండలంలో మోసయ్యపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వంకార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, డ్రైనేజీ సమస్యలను స్థానికులు విన్నవించారు. ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందిన పప్పు అశోక్‌కు రూ.పదివేల సొంత నగదును సాయంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పంచదార్ల పైడిరాజు, ఒడిసెల శ్రీనివాసరావు, కొమెజు ఈశ్వరరావు, గండిబోయిన వెంకట్, వైసిపి మండల శాఖ అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, నేతలు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి-రావికమతం: రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక రకాలుగా అందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో గ్రామాలలో తాము ధైర్యంగా తిరుగుతున్నామని ఎమ్మెల్యే ధర్మశ్రీ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం గుడివాడ పంచాయతీ పిల్లవాని పాలెం, దాసరిపాలెం గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు కాలేదని తెలిపారు. ఈ పథకాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక అధికార పక్షంపై బురద జల్లుతుందని విమర్శించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రం అధోగతి పాలైందని, ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందన్నారు. అప్పట్లో నాయకులు దాచుకోవడం, దోచుకోవడం తప్ప ప్రజలకు సేవ చేసింది ఏమీ లేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం లంచాలకు ఎక్కడా తావు లేకుండా పథకాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనే జమ అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పారదర్శకమైన పాలన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలరాజు, మండల ఆగ్రో అడ్వైసరీ కమిటీ చైర్మన్, మండల పార్టీ నాయకులు కంచిపాటి జగన్నాధరావు, తోటకూర పాలెం మాజీ సర్పంచ్ రుత్తల బాపు నాయుడు, కవగుంట సర్పంచ్ వరహాలు, హైస్కూల్ చైర్మన్ ప్రసాద్, మాజీ కోపరేటివ్ అధ్యక్షులు త్రిమూర్తులు, తహసీల్దార్ ఉమా మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, హౌసింగ్ ఏఈ రామచంద్రరావు, పంచాయతీ రాజ్ ఏఈ సుమతి, నాయకులు బేతా పాండు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ



వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

ఎంపిడిఒకు కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు రక్షణ కల్పించాలని కార్యదర్శుల యూనియన్ నాయకులు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారామరాజుకు రాజయ్యపేటలో జరిగిన సంఘటనపై శనివారం యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాజయ్యపేటలో శనివారం గ్రామ సభ నిర్వహించగా ముగ్గురు యువకులు సభకు అడుగడుగునా ఆటంకం కలిగిస్తూ దాడులకు పాల్పడ్డారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ అధికారులతో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని, దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పీవీపీ రాజశేఖర్, ఎం.శ్రీను, నరసింహారావు, జయప్రకాష్, నరసింహ రాజు తదితరులు పాల్గొన్నారు.

యువశక్తిని విజయవంతం చేయండి

ప్రజాశక్తి- నర్సీపట్నంరూరల్: ఈ నెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జరగనున్న యువశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ ఏలూరు ఇన్చార్జ్, యువశక్తి ప్రచారకర్త రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శనివారం నర్సీపట్నం ఎన్జీఒ హోమ్ లో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలన్నారు. యువత గళం వినిపించేలా యువశక్తి కార్యక్రమానికి జనసేనాని పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యచంద్ర, గణేష్, దొరబాబు, శానపతి శేషు, బైన మురళీ, కొత్తకోట రామశేఖర్, పి.నాగు, చిరంజీవి శ్రీను, కర్రి సురేష్, చప్పా నానాజీ పాల్గొన్నారు.

త్వరితగతిన గృహాల నిర్మాణం



పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల: హౌసింగ్ డే సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు లు కొడవటిపూడి, వెంకటాపురం గ్రామాలలో హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు లబ్ధిదారులందరూ సకాలంలో చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలతో పాటు మెటీరియల్ అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జానకమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ కరుణ, గ్రామ సర్పంచ్ అప్పారావు, పిఆర్ ఇంజనీర్ వర్మ, కార్యదర్శి భాగ్యలక్ష్మి, పిఒపిఆర్డి ప్రేమ్ కుమార్, ఏపీఎం రమణకుమారి, వైసిపి నాయకులు త్రినాధ్ పాల్గొన్నారు.

గృహాలు నిర్మించకుంటే పట్టాలు రద్దు

చీడికాడ: జగనన్న హౌసింగ్ కాలనీ డే సందర్భంగా ఖండివరం, కోనాం గ్రామాలలో ఎంపీడీవో జయప్రకాష్ మండల స్థాయి అధికారులతో జగనన్న హౌసింగ్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జగనన్న ఇళ్లు మంజూరై హౌసింగ్ నిర్మాణాలను ప్రారంభించని పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇంకా ఇల్లు నిర్మాణం ప్రారంభించని వారిలో వీరభద్ర పేటలో 13 మంది, ఖండివరంలో 31 మంది, కోనాంలో 13 మంది ఉన్నారని, నిర్మించకుంటే పట్టాలను తక్షణమే రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కిందకి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

ప్రమాదకర స్థితిలో విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి-మాడుగుల: విద్యుత్ తీగలు ప్రమాదకర పరిస్థితిలో కిందకి వేలాడుతుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. మాడుగుల నుండి రామచంద్రాపురం వెళ్లే రహదారిలో కొత్తగా నిర్మాణం అవుతున్న జగనన్న కాలనీకి ఎదురుగా రహదారి అడ్డంగా విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. గత కొద్ది కాలంగా విద్యుత్ శాఖ అధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్ట లేదని, ఈ మార్గంలో ప్రయాణించే నాటు బండ్లు, ట్రాక్టర్లకు వైర్లు తగిలే ప్రమాదం ఉందని రైతు సంఘం నాయకులు భీముని జగన్నాథరావు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పనులు చేయిస్తున్న సర్పంచ్ విజయ్‌కుమార్

డ్రైయినేజీలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-వడ్డాది: బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామంలో సర్పంచ్ యల్లపు విజయ్‌కుమార్ ఆధ్వర్యాన పారిశుధ్య పనులు చేపట్టారు. జెసిబి, ట్రాక్టర్ సహాయంతో మురుగునీటి కాలువల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని దగ్గరుండి సర్పంచ్ తొలగించారు. ఈ చెత్తా చెదారాన్ని ట్రాక్టర్ సహాయంతో తరలించారు. పారిశుధ్య పనులు చేపట్టడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

పింఛన్ల రద్దు అన్యాయం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో పింఛన్లు నిలుపుదల చేసిన వారికి తిరిగి మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేసారు. ఎటువంటి కారణాలు లేకుండా నిరుపేదల పెన్షన్లు నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. ఏవో సాకులు చెప్పి ప్రభుత్వ పథకాలు, పింఛన్లు నిలుపుదల చేయడం తగదని ఆయన అన్నారు. మండలంలోని అర్హులైన వారికి కాపునేస్తం పథకాన్ని లబ్దిదారులకు అందించాలని, పింఛన్లు పునరుద్ధరించాలని కోరుతూ ఈవోపిఆర్‌డి సత్యన్నారాయణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాల సొసైటీ మాజీ అధ్యక్షులు గోవిందరావు, వైసిపి యూత్ నేత రాజేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అప్పలరాజు



హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఆలయ నిర్మాణానికి ఎంవిఆర్ సాయం

ప్రజాశక్తి-మాడుగుల: నియోజకవర్గంలోని దేవరాపల్లి మండలంలో బోయిల కింతాడ గ్రామంలో షిరిడి సాయిబాబా ఆలయ నిర్మాణానికి అనకాపల్లికి చెందిన ఎంవీఆర్ ట్రస్ట్(ముత్యాల వెంకటేశ్వరరావు)ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయించడంతో ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గత కొద్దికాలంగా గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి విరాళాలు పోగు చేసి నిర్మాణం ప్రారంభించినా ఆర్థిక సమస్యలతో మధ్యలో ఆగడంతో అనకాపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావును సంప్రదించారు. ఆయన ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు అంగీకారం తెలిపారని గ్రామస్తులు శనివారం తెలిపారు. కొద్ది కాలం కిందట తమ సమీప గ్రామానికి ముత్యాల వెంకటేశ్వరరావు అంబులెన్స్ సదుపాయం కల్పించారని, గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయాలకు సైతం సహకారం అందిస్తున్నారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ సేవా ట్రస్ట్ మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జులు అప్పలనాయుడు, ప్రణీత పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



మృతి చెందిన చేపలు

పెద్ద చెరువులో చేపలు మృత్యువాత

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : మండలంలో గబ్బాడ గ్రామంలో పెద్ద చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. సుమారు 2000 కేజీలకు పైగా చేపలు చనిపోయాయని చేపల వ్యాపారి ఎల్లన్న తెలిపారు. ఈ చేపలను అమ్ముకొని పంచాయతీకి కొంత ఆదాయాన్ని ఇస్తానని, ఇలాంటిది గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. తన వ్యాపారాన్ని దెబ్బ తీసేందుకే ఎవరో కుట్ర పూరితంగా విష ప్రయోగం చేసినట్లు ఆయన అన్నారు.

పాడిరైతుల అభ్యున్నతికి తులసీరావు ఎనలేని కృషి

విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : పాడి రైతుల అభ్యున్నతికి విశాఖ డెయిరి చైర్మన్ ఆడారి తులసీరావు ఎనలేని కృషి చేశారని, ఆయన మరణం తమకు తీరని లోటని బుచ్చయ్యపేట మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. కోమల్లపూడిలోని విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణను శనివారం పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ తులసిరావు మృతి తమను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. బుచ్చయ్యపేట మండలానికి విశాఖ డైరీ ద్వారా కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను చేశారని తెలిపారు. మండలంలో దిబ్బిడి, బుచ్చయ్యపేట తదితర గ్రామాల్లో కోట్లాది రూపాయలతో మండపాల నిర్మాణం చేపట్టారని, విద్యార్థులకు అవసరమైన పాఠశాల భవన నిర్మాణాలు, రైతుల అవసరాలకు అనుగుణంగా మధుముల నిర్మాణం, కస్పా పొలానికి సాగునీటిని అందించే విషయంలో సుమారు రూ.80 లక్షలతో గ్రోయిన్ నిర్మాణం వంటి అనేక పనులు చేపట్టారని తెలిపారు. తులసిరావుతో తనకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను గుర్తు చేసుకుని నాయకుల సమక్షంలోనే గేదెల సత్యనారాయణ కన్నీటి పర్యంతమయ్యారు. కుల మతాలు, పార్టీలకతీతంగా ఎన్నో కుటుంబాలకు విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు తులసిరావు కల్పించారని కొనియాడారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న గేదెల సత్యనారాయణ

రాజారావును అరెస్టు చేయండి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉద్దండపురంలో బాధిత దళితులను శనివారం ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, ఏపీపీఎస్సీ సభ్యులు సోనీ వుడ్ పరామర్శించారు. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పేకేటి రాజారావు, అతని అనుచరులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని కులాల పెద్దలు కలిసి శాంతి కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోని వుడ్, సుజిత్ కాంత్‌లు 40 కుటుంబాలకి నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రవీణ్ కుమార్, సిఐ నారాయణరావు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

చెకుముకి రాష్ట్ర పోటీలకు మాడుగుల బాలికలు

ప్రజాశక్తి-మాడుగుల:రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు మాడుగులకు చెందిన వీనస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న బాలికలు అర్హత సాధించారు. వీరిలో కోన కావ్యశ్రీ, ఎం.శరణ్య (కింతలి జెడ్పి ఉన్నత పాఠశాల) ఆడారి మోహన ప్రియ (మాడుగుల జడ్పీ ఉన్నత పాఠశాల), మామిడి లికిత (మాడుగుల ఆర్‌సిఎం పాఠశాల)లు జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించడంతో ఈనెల 21, 22 తేదీలలో కడప జిల్లాలో జరగనున్న రాష్ట్ర పోటీలకు హాజరు కానున్నారు. వీరికి వీనస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తాలపు రెడ్డి నాగచంద్ర శిక్షణ ఇచ్చారు. వీరికి జన విజ్ఞాన వేదిక మాడుగుల డివిజన్ కమిటీ అధ్యక్షులు సురేష్ శాంతో, ప్రధాన కార్యదర్శి తాళపు రెడ్డి నాగచంద్ర, ఉపాధ్యక్షులు జాగాని ఈశ్వరరావు, కార్య దర్శి గౌరీపట్నపు మహేష్, కోశాధికారి చిన్నం నాయుడు అభినందనలు తెలిపారు.

ఎపిపిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం :ఎపిపిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం చోడవరం తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. చోడవరంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నికలు శనివారం జరిగాయి. యూనిట్ అధ్యక్షునిగా ఎల్.కామేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా పి.రామారావు, సెక్రటరీగా సి. హెచ్ సింహాచలం, జాయింట్ సెక్రటరీగా ఎ.బాలాజీరావు, ట్రెజరర్‌గా బి.పుష్పలత, జిల్లా కౌన్సిలర్ 1గా కె.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ 2గా డి.కొండలరావులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల అధికారిగా జి.గంగాధర్, పర్యవేక్షకులుగా ఎస్.సత్తిబాబు(జిల్లా ప్రెసిడెంట్) వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులకు గౌరవ అధ్యక్షులు యు.కూర్మారావు అభినందనలు తెలిపారు.



ప్రమాణం చేయిస్తున్న గంగాధర్

నేడు వైసిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి -పాయకరావుపేట:నియోజకవర్గం పరిధిలో ఈనెల 8న ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని ఎమ్మెల్యే గొల్ల బాబురావు పిలుపునిచ్చారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టిటిడి చైర్మన్, ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, వ్యవసాయ శాఖ సలహా మండలి అభివృద్ధి చైర్మన్ చిక్కాల రామారావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, జడ్పిటిసి లంక సూర్యనారాయణ హాజరవుతారన్నారు. నాయకులు, అభిమానులు పాయకరావుపేట పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రఘుపతి ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఇ - క్రాప్‌పై ఆరా

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో గోకులపాడు, సర్వసుద్ధి గ్రామాలలో జిల్లా వ్యవసాయాధికారి . మోహన్‌రావు పర్య టించారు. ఈ క్రాప్ బుకింగ్‌పై సమీక్షిం చారు.రైతుల వివ రాలు ఈ క్రాప్ బుకింగ్ లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం తిమ్మాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఇ సౌజన్య, ఆర్‌బికే ఇన్చార్జిలు పాల్గొన్నారు.



ఆరా తీస్తున్న మోహనరావు

ఒబిసి ఎన్నికల్లో ప్యానల్-2 విజయం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఒబిసి యూనియన్ గుర్తింపు ఎన్నికలలో మహాత్మ జ్యోతిరావు పూలే యునైటెడ్ ఒబిసి ప్యానెల్ తరపున పోటీ చేసిన ప్యానెల్-2 విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో హోరాహోరీగా మూడు ప్యానళ్లు పోటీ పడ్డాయి. ఒబిసి ప్యానెల్‌లో రిజిస్టర్ అయిన సభ్యులు 2598 మంది ఉండగా 2253 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్యానెల్-1 - 96, ప్యానెల్ - 2 1294, ప్యానెల్-3 864 ఓట్లు సాధించాయి. 430 పైచిలుకు ఓట్ల మెజారిటీతో ప్యానెల్-2 విజయం సాధించింది. విజయం సాధించిన ప్యానెల్-2 అధ్యక్షుడు బి.అప్పారావు మాట్లాడుతూ తమ ప్యానెల్‌పై నమ్మకంతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్లాంట్ పరిరక్షణలో కీలకంగా వ్యవహరిస్తామని సభ్యులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్యానల్‌లో ప్రధాన కార్యదర్శిగా ముసురు శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వైఎల్.నాయుడు, ట్రెజరర్‌గా ఉండవల్లి శ్రీనివాసరావు, సభ్యులుగా కోయిలాడ శ్రీను, నారాయణ, కొణతాల రామకృష్ణతోపాటు మొత్తం 30 మంది సభ్యులుగా కొనసాగుతారని తెలిపారు.



గెలిచిన ప్యానెల్ - 2 సభ్యులు

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన వెటరన్ క్రీడాకారులు



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు కలిగిస్తాయి. క్రీడలలో బాల బాలికలు, యువకులు తరచూ పాల్గొనడం మనం చూస్తాం. అయితే.. యువకులతో పాటు 60 ఏళ్లు నిండిన వారు కూడా క్రీడల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు. అటువంటి వారికి కూడా పోటీలను నిర్వహించడానికి విశాఖ నగరం వేదికగా నిలిచింది. స్థానిక మద్దిలపాలెంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ జిల్లా ఛాంపియన్ షిప్ - 2023 మాస్టర్స్ పేరుతో పోటీలను శుక్ర, శనివారాల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో పలు జట్లు పాల్గొన్నాయి. 60 ఏళ్లు నిండిన వారికి జరిగిన ఈ పోటీల్లో ఎం.మోహన్‌రావు, జి. శ్రీహరి విన్నర్స్‌గా నిలిచారు. రన్నర్స్‌గా రెడ్డి దామోదర్, పి.హరిప్రసాద్ నిలిచారు. ఈ రెండు జట్లు మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. ఎంతో ఉత్సాహంగా యువకులను కూడా మించి వెటరన్ క్రీడాకారులు తమ సత్తా చాటడం పట్ల క్రీడాకారుల్లో, క్రీడాభిమానుల్లో హర్షం వ్యక్తమైంది.

మిక్స్‌డ్ డబుల్స్ విజేత మురళి, ఉషశ్రీ

ఇది ఇలా ఉండగా ఇదే సందర్భంగా నిర్వహించిన మిక్స్‌డ్ డబుల్స్ పోటీలలో మురళి, ఉషశ్రీ విజయం సాధించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, సబ్ రిజిస్ట్రార్స్ జోనల్ ప్రెసిడెంట్, మధురవాడ సబ్ రిజిస్ట్రార్ ఎస్.మోహన్ రావు, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ పోతురాజు, డిఐజి ఆర్.దామోదర్, ఆర్‌టిఐ హరి ప్రసాద్, టోర్నమెంట్ ఆర్గనైజర్ చంద్రశేఖర్, జివిఎంసి 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వైశ్యరాజు జ్యూయలర్స్ ఆధ్వర్యాన

నేడు ముత్యాల ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి -విశాఖపట్నం:ప్రజాశక్తి, వైశ్యరాజు జ్యూయలర్స్ సంస్థల ఆధ్వర్యాన గాజువాకలో ఆదివారం ముత్యాల ముగ్గుల పోటీలు జరుగనున్నాయి. ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే ఈ పోటీలకు వైశ్యరాజు జ్యూయలర్స్ సహకారాన్ని అందిస్తోంది. సంక్రాంతి సంబరాలు, ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా తలపెట్టిన ఈ ముత్యాల ముగ్గుల పోటీల్లో గాజువాక, తోకాడ ప్రాంతాల్లోని సమైక్య అపార్టుమెంట్, స్వర్ణసాయి ఎన్‌క్లేవ్, సిరి అపార్టుమెంట్, గ్రీన్ లైఫ్ అపార్టుమెంట్‌ల నుంచి మహిళలు పాల్గొంటున్నట్లు ప్రజాశక్తి బ్రాంచి మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. విజేతలకు వైశ్యరాజ్ జ్యూయలర్స్ వారిచే బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తామన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం-ప్రజల పక్షం | vysyaraju jewellers

ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, సకాలంలో అందరూ హాజరుకావాలని కోరారు. ఒక గంటలో ముగ్గు వేయాల్సి ఉంటుందని, గెలిచిన వారికి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వేదిక వద్ద బహుమతులు అందజేస్తామని తెలిపారు. వేదిక ప్రాంగణం వద్ద వైశ్యరాజు జ్యూయలర్స్ వారు ఉచితంగా మహిళలకు మెహందీ పెట్టనున్నారని తెలియజేశారు.

బాలికలకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:కిషోర బాలికలకు రక్త హీనత కలుగకుండా మంచి పౌష్టికాహారం అందిం చాలని ఏరియా కో ఆర్డినేటర్ కె. సత్యన్నారాయణ సూచించారు. మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బాలికలకు విటమిన్, ప్రోటీన్లు కలిగిన ఆహారం అందేలా చర్యలు అంగన్వాడీ సిబ్బంది చూడాలన్నారు.తల్లిదండ్రులు బాలికల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ఆకు కూరలు, తృణ ధాన్యాలు, పండ్లు ఇవ్వాలని సూచించారు. బాలికలకు హిమోగ్లోబిన్ శాతం తగ్గకుండా ట్యాబెట్లు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిసిలు, పొదుపు సంఘం ప్రెసిడెంట్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆఫీసర్ అనూష పాల్గొన్నారు.



హాజరైన సిపి, ప్రసిడెంట్లు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని చెట్టుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన దళిత మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు మాట్లాడుతూ, ఎస్సీ కాలనీలో సుమారు నెల రోజులుగా మంచినీళ్లు లేక అవస్థలు పడుతున్నామని, అధికారులకు గోడు వినిపించినప్పటికీ పట్టించు కోలేదన్నారు. ఎస్సీ కాలనీలో మురుగునీటి కాలువల్లో పూడిక తీయలేదన్నారు. దీంతో ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. ఎస్సీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్, ఆర్డీవో, ఎంపిడిఒలకు విన్నవించినా స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి తక్షణమే మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరిస్తామని నర్సీపట్నం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుపరాల రాంతల్లి, కుపరాల దారాలమ్మ, పుడతా లక్ష్మి, మారుతి రమణమ్మ, కుపరాల దేవమ్మ, కుపరాలు అచ్చియ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

12న మండల సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ డేవిడ్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

15 గృహాలు మంజూరు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట గ్రామ పంచాయతీ శివారు బుడ్డిబంద గ్రామంలో తనంగా నిర్మిస్తున్న ఇళ్లకు ఇ ం జ నీ రి ం గ్ అసిస్టెంట్ శనివారం జియో ట్యాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు మాట్లా డుతూ, చోడవరం శా న న న భ్ ్యలం కరణం ధర్మశ్రీ కవగుంట పంచాయతీకి సుమారు 15 ఇళ్లను మంజూరు చేశారన్నారు.ఒక్కొక్క ఇంటికి రూ.1,80,000ల నిధులు మంజూరు చేస్తూ సిమెంటు, ఇసుక, ఐరన్ తదితర సామాగ్రిని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ పేదలందరికీ ఉచితంగా స్థలాలు ఇచ్చి గృహాలను మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రొబ్బా వీరభద్రరాజు, రంసాల గంగరాజు, మామిడి రవి పాల్గొన్నారు.



జియో టాగింగ్ చేస్తున్న సిబ్బంది

విశాఖ వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి-రావికమతణ్ణమండలంలో మేడివాడ గ్రామానికి చెందిన గేడి కళ్యాణం గత పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ ఓమ్ని ఆర్కేలో చికిత్స పొందుతున్నాడు. గ్రామ వాలంటీర్ గంట నాయుడు ఆసుపత్రికి వెళ్లి కళ్యాణంకు పెన్షన్ ఇచ్చి తన సేవా భావాన్ని చాటుకున్నాడు.



పింఛను ఇస్తున్న వాలంటీర్

ఉత్తమ వైద్యాధికారికి జెసి అభినందనలు

ప్రజాశక్తి-చీడికాడ:మెరుగైన వైద్య సేవలు అందించినందుకు గాను పెదగోగాడ పిహెచ్‌సి వైద్యాధికారి దాడి అప్పారావు నాయుడును జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అభినందించారు. ఉత్తమ వైద్యులుగా జిల్లాలో ఐదుగురును ఎంపిక చేశారు. వీరిలో చీడికాడ మండలం పెద్ద గోగాడ పీహెచ్సీ నుండి అప్పారావు నాయుడు ఒకరు. ఉత్తమ వైద్యాధికారిగా ఎంపిక కావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అప్పారావు నాయుడు విలేకరులతో మాట్లాడుతూ, ఉత్తమ వైద్యాధికారిగా గుర్తించినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



అభినందిస్తున్న జెసి